

బీజేపీ చీఫ్‌విప్‌గా ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 14: బీజేపీ చీఫ్‌విప్‌గా ఎమ్మెల్యే హరీష్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు.

రేపటి సమ్మెను విజయవంతం చేయండి

వాంకిడి, ఫిబ్రవరి 16: ఈనెల16న నిర్వహించనున్న దేశవ్యాప్తసమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లాఅధ్యక్షుడు తిరుపతి కోరారు. కేంద్ర ప్రభుత్వం వలంభిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేకవిధానాలకు నిరసనగా దేశవ్యాప్తబంద్ చేపడుతున్నామన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: కార్మికసంఘాల ఆధ్వర్యంలో రేపునిర్వహించే దేశవ్యాప్త భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లాకార్యదర్శి ఎండీ చాంద్‌పాషా అన్నారు.

పూలాజీ బాబా ధ్యానకేంద్ర వార్షికోత్సవం

వాంకిడి, ఫిబ్రవరి 14: మండలంలోని బంబారలో బుధవారం పరమహంస సద్గురు పూలాజీ బాబా ధ్యానకేంద్ర 16వవార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పూలాజీ బాబా చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పూలాజీబాబా తనయుడు కేశవరావు, భక్తులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

దహెగాం, ఫిబ్రవరి 14: మండలంలోని ఎరువుల దుకాణాలను ఏవో వంశీకృష్ణ బుధవారం తనిఖీ చేశారు. ఎరువుల విక్రయాలు, స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు ఈ-పాస్‌లోనమోదు చేయాలన్నారు.

అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

బెజ్జూరు, ఫిబ్రవరి 14: మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ పక్కనఉన్న ఎస్సీ కమ్యునిటీ భవనం ఎదుట అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు బుధవారం ఎంపీడీవో మాధవి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఎస్సై విక్రం, ఎంపీవో రమేష్‌రెడ్డి, ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, నాయకులు శ్రీవర్ధన్, దిగంబర్, శంకర్, తిరుపతి, దేవాజీ, సీహెచ్ దేవాజీ, నారాయణ, తిరుపతి, జావీద్ అలీ, సంతోష్, రాజారాం, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

బదిలీల జాతర..



- పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదిలీలు
- మూడేళ్లు పైబడి పనిచేసిన అధికారులకు స్థానచలనం
- ఇప్పటికే ఆయా శాఖల అధికారుల బదిలీ
- మరికొంత మంది బదిలీలకు కసరత్తు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 14: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మూడేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న జిల్లాలోని పలుశాఖల అధికారులను ప్రభుత్వం బదిలీ చేస్తోంది. ఇప్పటికే పలుశాఖల అధికారులను మార్పుగా తాజాగా పలు కీలక శాఖలకు చెందిన అధికారులకు స్థానచలనం కల్పించింది. అధికారుల మార్పుతో కాంగ్రెస్ ప్రభుత్వం తనమార్క్ చూపుతోంది. జిల్లాలో జడ్పీ సీఈవో, ఆర్డీవో, ఎంపీడీవో, పోలీస్, ఎక్సైజ్‌శాఖల అధికారుల బదిలీలు జరుగగా మరిన్ని విభాగాల్లో బదిలీల పర్వం కొనసాగుతోంది.

● మూడేళ్లు దాటిన అధికారులకు స్థానచలనం..

పార్లమెంట్ ఎన్నికలకు గడువు సమీపిస్తుండంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వివిధ శాఖల్లో మూడేళ్లు పైబడి పనిచేస్తున్న అధికారులకు స్థానచలనం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అవుతున్నాయి. ఇప్పటికే జిల్లాలో జడ్పీ సీఈవోగా పనిచేస్తున్న రత్నమాలను ఆదిలాబాద్ జడ్పీ సీఈవోగా బదిలీ చేసి ఆమె స్థానంలో హైదరా బాద్‌లోని టీఎస్‌ఐఆర్డీలో జేడీగా పనిచేస్తున్న అనిల్‌కుమార్‌ను నియమించింది ప్రభుత్వ, రెవెన్యూ శాఖలో ఆసిఫాబాద్ ఆర్డీవోగా విధులు నిర్వహి స్తున్న కదం సురేష్‌ను నాగల్ కర్నూల్ ఆర్డీవోగా బదిలీ చేసి నిర్మల్ ఎస్‌డీసీగా పనిచేస్తున్న లోకేశ్వర్ రావును ఆసిఫాబాద్ ఆర్డీవోగా నియమించింది. దీంతోపాటు జిల్లాలో పనిచేస్తున్న ఎనిమిది మంది ఎంపీడీవో లను మంచిర్యాల జిల్లాకు బదిలీచేస్తూ, మంచిర్యాల జిల్లాలో పనిచేస్తున్న ఏడుగురు ఎంపీడీ వోలతో పాటు మహబుబ్‌నగర్ నుంచి ఒకరిని ఆసిఫాబాద్ జిల్లాకు బదిలి చేసారు. పోలీస్‌శాఖలో జిల్లాలోని ఆసిఫాబాద్, రెబ్బెన సీఐలను బదిలీ చేసి రామగుండం పోలీస్ కమిష నరేట్ పరిధిలో పనిచేస్తున్న సతీష్‌ను ఆసిఫాబాద్, చిట్టిబాబును రెబ్బెన సీఐలుగా నియమించింది. ఎక్సైజ్‌శాఖలో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ సీఐలుగా పని చేస్తున్న మోసిన్‌అలీ, మంగమ్మను బదిలీ చేస్తూ వారిస్థానంలో ఆసిఫాబాద్ సీఐగా దీపక్, కాగజ్‌నగర్ సీఐగా సామ్యుల్ జాన్‌ను నియమించారు. అలాగే ఆసిఫాబాద్ మున్సిపాలిటీ కమిషనర్‌గా మంచిర్యాల జిల్లాలో పనిచేస్తున్న భుజంగ్‌రావ్‌ను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. బదిలీ అయిన అధికారులు తక్షణమే విధుల్లో చేరాలని ఆదేశాలు ఉండడంతో జిల్లాలో అంతా హడావుడి నెలకొంది.

● మరికొంత మంది అధికారుల బదిలీకి కసరత్తు..

జిల్లాలో మరికొంత మంది అధికారుల బదిలీకి కసరత్తులు జరుగుతు న్నాయి. ఆయాశాఖల వారీగా మూడేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న అధికారుల వివరాలు సేకరించి వారిని కూడా బదిలీ చేసేందుకు ప్రభుత్వం యోచి స్తోంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రభుత్వ శాఖల వారీగా పరిశీలిస్తూ బదిలీ ఉత్తర్వులను జారీచేస్తున్నారు. దీంతో జిల్లాలోని పోలీస్, రెవెన్యూశాఖలతో పాటు ఇతర ప్రధానశాఖల్లో మరికొంత మంది అధికారుల బదిలీలు అయ్యే అవకాశాలు ఉన్నాయి.

బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్‌కమిషనర్



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కమిషనర్ భుజంగరావు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 14: ఆసిఫాబాద్ మున్సిపాలిటీ కమిషనర్‌గా భుజంగరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం ఆసిఫాబాద్ మేజర్ గ్రామపంచాయతీని ఇటీవల మున్సిపాలిటీగా మారుస్తూ జీవో విడుదల చేసింది. ఈ మేరకు మంచిర్యాల జిల్లాలో పనిచేస్తున్న భుజంగరావు ఆసిఫాబాద్ మున్సిపాలిటీ కమిషనర్‌గా బదిలీ చేసింది. ఈ మేరకు ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం కలెక్టర్ హేమంత్ బోర్కడేను, అదనపుకలెక్టర్ దీపక్ తివారిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది వంశీ కృష్ణ, సంతోష్, నాగేందర్, ఉదయ్, వంశీ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలి

బెజ్జూరు, ఫిబ్రవరి 14: విద్యార్థులు బాగా కష్టపడి చదివి ఉన్నతలక్ష్యాలను చేరుకోవాలని బెజ్జూరు ఎస్సై విక్రం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా పరీక్షలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో ఇంటర్ కీలకమని సూచించారు. విద్యార్థులు నిర్భయంగా పరీక్షలుబాగా రాసి కళాశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుడు జ్ఞానేశ్వర్, స్వపన్ మండల్, మారుతి, సునీత తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలించిన కమిషనర్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 14: ఆసిఫాబాద్ పట్టణంలోని పెద్దవాగు నది సమీపంలో బాలేశ్వరస్వామి జాతరను పురస్కరించుకొని మున్సిపల్ కార్మికులు చేపడుతున్న పారిశుధ్య పనులను బుధవారం కమిషనర్ భుజంగరావు పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సమీపంలోని పిచ్చి మొక్కలను, ముళ్లపొదలను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు.

విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవం



హోమ కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు

కెరమెరి, ఫిబ్రవరి 14: మండలకేంద్రంలోని రామగౌడ్‌తోటలో బుధవారం నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీదుర్గామాత, రామచంద్రమూర్తి, శ్రీకృష్ణుడి విగ్రహాలను ప్రతిష్ఠాపించారు. ఈ సందర్భంగా మండప పునశ్చరణ పూజ, మూలవిరాట్టు ప్రతిష్ఠాపణ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, పూర్ణాహుతి, షొడోశోపచార పూజ, మంగళహారతి, మంత్రపుష్పం, తదితరపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు లక్ష్మీనారాయణగౌడ్, మురళీగౌడ్, ప్రవీణ్‌గౌడ్, కెరమెరికి చెందిన ఉత్తం రాథోడ్, రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ఘనంగా సమ్మక్క సారలమ్మకు బోనాలు



గద్దెల వద్దకు బోనాలతో వస్తున్న భక్తులు

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 14: మండలంలోని కర్జవెల్లి గ్రామ అటవీప్రాంతంలో వెలసిన సమ్మక్క-సారలమ్మ గద్దెలవద్ద గ్రామస్థులు బుధవారం ఘనంగా బోనాలను సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనంవండి అమ్మవార్లకు సమర్పించారు. సమీపగ్రామాల ప్రజలు అధికంగా రావడంతో ఆ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసింది. అనంతరం భక్తులకు అన్నదానంచేశారు. డప్పువాయిద్యాలు శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి.

ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అరెస్టు సరికాదు

● బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 14: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పోలీసులు అరెస్టుచేయటం హేయమని బీఎస్పీ రాష్ట్రకార్యదర్శి సిడాం గణపతి అన్నారు. బుధవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. చర్చివద్ద జరిగిన గొడవలో క్షతగాత్రులను పరామర్శించేందుకువెళ్లగా పోలీసులు అరెస్టు చేయటం ఎంతవరకు సమంజసమన్నారు. గత ప్రభుత్వం ఇదే తరహాలో చేసిందన్నారు. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదేబాట పట్టిందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు అరెస్టు విషయంపై ఊరుకునేది లేదన్నారు. పోరుబాట పట్టి ప్రభుత్వం కళ్లు తెరిపించేట్టు చేస్తామన్నారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు శ్యాంరావు జాడే, నక్క మనోహర్, పిల్లల తిరుపతి, రాజ్‌కుమార్ యాదవ్, టక్కురి పోచం, శోభన్ పాల్గొన్నారు.

అరెస్టును ఖండించిన బీఎస్పీ నాయకులు

బెజ్జూరు: చేవెళ్ల నియోజకవర్గంలో క్రైస్తవులపై దాడి చేసిన వారిని అరెస్టుచేయకుండా దాడికి గురైన వారిని పరామర్శించడానికి వెళ్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టుచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఎస్పీ నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానికంగా వారు మాట్లాడుతూ ఇప్పటికీ 6గంటలు కావస్తున్నా దాడి చేసిన వారిని అరెస్టు చేయకుండా సీఎం, పోలీసులు ఏం చేస్తున్నారన్నారు. వెంటనే ప్రవీణ్‌కుమార్‌ను విడుదలచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవాజీ,అశోక్, ఖాజామియా, సల్మాన్‌ఖాన్, సారయ్య, రాజలింగు, షణ్ముఖ, లక్ష్మణ్‌బాబు, రాజలింగు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలి



ఈ- డిస్ట్రిక్ట్ మేనేజర్, ఎన్‌ఐసీ ఇన్‌చార్జితో మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 4: వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో విధులకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎన్‌ఐసీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు అవసరమయ్యే అధికారులు, సిబ్బంది వివరాలను ఆయా శాఖల నుంచి సేకరించి అర్హులైన వారివివరాలను ఎన్‌ఐసీ సాఫ్ట్‌వేర్‌ద్వారా ఈ-డిస్ట్రిక్ పోర్టల్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని ఈ-డిస్ట్రిక్ట్ పోర్టల్ మేనేజర్ గౌతమ్, ఎన్‌ఐసీ ఇన్‌చార్జి శ్రీకాంత్‌ను ఆదేశించారు. ప్రతిశాఖ నుంచి అవసరమైన అధికారులు, సిబ్బంది వివరాలను సేకరించి నమోదు ప్రక్రియ త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు పాల్గొన్నారు.

ఎంపీగా అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా

జైనూర్, ఫిబ్రవరి 14: ఒక్కసారి తనకు ఆదిలాబాద్ ఎంపీ టికెట్టు ఇస్తే జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తానని కాంగ్రెస్‌పార్టీ జిల్లా నాయకులు పెందుర్ గోపి అన్నారు. మండలకేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తనకు రాజకీయంగా పట్టు ఉందని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నాన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తనకు ఎంపీ టికెట్టు కట్టబెట్టాలని ఆయన అధిష్టానానికి విజ్ఞప్తిచేశారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అయ్యుబ్‌ఖాన్, అబ్దుల్ ముకీద్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

ఆసిఫాబాద్/కెరమెరి/వాంకిడి/సిర్పూర్(యు)/కెరమెరి, ఫిబ్రవరి 14: ఆసిఫాబాద్ ఎంపీడీవోగా టి శ్రీనివాస్, తిర్యాణి మండల ఎంపీడీవోగా వేముల మల్లేష్, తహసీల్దార్‌గా సునీల్‌కుమార్, వాంకిడి మండల తహసీల్దార్‌గా వరలక్ష్మి, ఎంపీ డీవోగా రోహిత్, సిర్పూర్(యు) ఎంపీడీవోగా వి ప్రవీణ్ కుమార్, కెరమెరి ఎంపీడీవోగా కృష్ణారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వీరి స్థానాల్లో ఇక్కడ పనిచేసిన వారంతా మంచిర్యాల జిల్లాలోనిపలు మండలాలకు బదిలీ అయ్యారు.

కేశవనాథస్వామి గ్రంథాలయం ప్రారంభం

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 14: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలో కేశవనాథస్వామి గ్రంథాలయాన్ని సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షుడు మనోజ్ అధ్యక్షతన రిటైర్డ్ హెచ్ఎం లక్ష్మణ్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం శుభసూచికమని అన్నారు.

అసెంబ్లీలో సమస్యలపై ప్రస్తావించిన ఎమ్మెల్యే

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 14: అసెంబ్లీలో బుధవారం జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ వైద్యరంగ సమస్యలను పరిష్కరించాలన్నారు. కొత్తగా ఎంపికైన ఎమ్మెల్యేల్లో 17మంది ఎమ్మెల్యేలు వైద్యు లుగా ఉన్నారని, వీరి సూచనలు, సలహాలు తీసుకొని రాష్ట్ర వైద్యరంగాన్ని మెరుగు పరచాలన్నారు. అదేవిధంగా ఫిబ్రవరి 19న శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా స్పెషల్ క్యాజువల్ లీవ్ ఇవ్వాలని కోరారు. ప్రాణహిత ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎస్పీఎంలో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలని ప్రస్తావించారు.

క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుంది

● డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న విశ్వప్రసాద్

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 14: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ అన్నారు. బుధవారం మండలంలోని చింతగూడ కోయవాగులో చింతగూడ(కె) క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలతో శరీర దారుఢ్యత పెరుగుతుందన్నారు. బీఎస్పీ రాష్ట్ర కార్యనిర్వహక కమిటీ చైర్మన్ అర్షద్ హుస్సేన్ మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో క్రీడలను నిర్వహించటం అభినందనీయమన్నారు. క్రీడాకారులు క్రీడల్లో రాణించి జిల్లాకు మంచిపేరు తేవాలన్నారు. కార్యక్రమంలో జావేద్‌ఖాన్, ఉస్మాన్, తాజ్‌బాబా, మతీన్, పర్వేజ్, గౌస్, నిర్వాహకులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి



పెంచికలపేటలో చిన్నారులకు అక్షరాభ్యాసం



కాగజ్‌నగర్‌లో సరస్వతీ మాత వేషధారణలో చిన్నారి

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 14: జిల్లాకేంద్రంలోని ఆలయాల్లో బుధవారం వసంతపంచమిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శిశుమందిర్ పాఠశాలలో సరస్వతీమాత పూజ నిర్వహించి చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వర్‌రావు, పాఠశాలకమిటీ సభ్యులు పాల్గొన్నారు. సాయిబాబా ఆలయంలో, బాలేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్‌పట్టణంలోని పలుపాఠశాలల్లో సరస్వతీ దేవికి పూజలు, హోమాలను చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, సతీమణి డాక్టర్ అనిత, శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల కమిటీ చైర్మన్ డాక్టర్ దామోదర్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రభాగ్ రంగస్వామి, ఆయా పాఠశాలల కరస్పాండెంట్‌లు పాల్గొన్నారు.

జైనూర్: మండలకేంద్రంలోని భారతీ గ్రామర్‌పాఠశాలలో జ్ఞానసరస్వతీమాతకు ఉపాధ్యాయులు పూజలుచేశారు. విద్యార్థులకు ఓనమాలను దిద్దించారు. కరస్పాండెంట్ పొలిపెల్లి నరేందర్, ప్రిన్సిపాల్ శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెంచికలపేట: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను గర్భిణులు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని పోషన్ అభియాన్ ప్రాజెక్టు టెక్నికల్ అధికారి ప్రవీణ్ అన్నారు. మండలకేంద్రంలోని ఎల్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పిల్లలకు అక్షరాభ్యాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ ఉన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ

దహెగాం, ఫిబ్రవరి 4: మండలకేంద్రంలో ఈజీఎస్ పథకంలో కోటి రూపాయలతో రోడ్డు నిర్మాణానికి బీజేపీ మండలాధ్యక్షుడు ధనుంజయ్ బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండుసీసీరోడ్లు, సైడ్‌డ్రైనేజీ నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో సహకార చైర్మన్ తిరుపతి గౌడ్, ఎంపీటీసీ ధనుంజయ్, ఎంపీడీఓ రాజేందర్, ఎంపీఓ రాజేశ్వర్‌గౌడ్, కార్యదర్శి ప్రతీణ్‌బాబు, నాయకులు సంజీవ్, ప్రదీప్, సురేష్‌గౌడ్, మల్లేష్, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పారిశుధ్య వారోత్సవాలు

సిర్పూర్(టి), ఫిబ్రవరి 14:ఈనెల 8నుంచి గ్రామాల్లో చేపట్టిన పారిశుధ్యవారోత్సవాలు ముగిశాయి. బుధవారం సిర్పూర్(టి)గ్రామ పంచాయతీలో ఈఓ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పలుకాలనీల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే గురువారం గ్రామ పంచాయతీలో ప్రత్యేకగ్రామసభ నిర్వహిస్తున్నట్లు ఈవో కృష్ణమూర్తి తెలిపారు. ఆయనవెంట పారిశుధ్యసిబ్బంది ఉన్నారు.

విద్యుత్‌తీగలు అమర్చితే కఠిన చర్యలు

సిర్పూర్(టి), ఫిబ్రవరి 14: వేటగాళ్లు పంట పొలాల్లో, అటవీప్రాంతాల్లో విద్యుత్‌తీగలు అమర్చితే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్సై దీకొండ రమేష్ అన్నారు. బుధవారం పోలీసులు మీ కోసంలో భాగంగా మండలంలోని చుంచుపల్లి గ్రామంలో అవగాహన సదస్సునిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దొంగతనంగా కరెంటుతీగలు అమర్చడంవల్ల అటవీజంతువులతోపాటు మనుషులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడే వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం యువతకు వాలీబాల్, నెట్ పంపిణీ చేశారు.



యువతకు ఉపాధి కల్పించడం కోసమే స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 14: నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా మందమర్రిలో స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని మందమర్రి జీఎం మనోహర్ తెలిపారు. బుధవారం అన్ని డిపార్టుమెంట్ల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మందమర్రి ప్రాంతంలో డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, పదవ తరగతి పాసైన వారికోసం స్కిల్‌డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఇవ్వడానికి నిర్ణయించామన్నారు. బెల్లంపల్లి, మందమర్రి, భూపాలపల్లి ప్రాంతాల్లోని వారు కూడా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. 8వృత్తి కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలకు కాస్మోటాలజీ, ఇతరులకు డ్రోన్‌టెక్నీషియన్, సోలార్ టెక్నీషియన్, సెల్ టెక్నీషియన్, టూవీలర్ మెకానిక్, గ్యాస్‌వెల్డింగ్, కంప్యూటర్, డీటీపీ, ఇంటర్నెట్ కోర్సులపై శిక్షణ ఉంటుందన్నారు. కాస్మోటాలాజీకి ఎలాంటి విద్యార్హత అర్హత లేదన్నారు. మిగితా వాటికి డిగ్రీ, డిప్లొమా,10వ తరగతి పాసై ఉండాలని తెలిపారు. మందమర్రి,బెల్లంపల్లి,శ్రీరాంపూర్, రామగుండం1,2,ఏఎల్‌పీ, భూపాలపల్లికి చెందిన 42సంవత్సరాలలోపు యువతీ,యువకులు www.scclmines.comలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. ఈనెల 16నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని డిపార్టుమెంట్ల అధికారులు సమన్వయంతో ట్రైనింగ్‌ను విజయవంతం చేయడానికి కృషి చేయాలన్నారు.

ఓసీపీలో ప్రమాదం : కాంట్రాక్ట్ డ్రైవర్‌కు గాయాలు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 14: శ్రీరాంపూర్ ఓసీపీలో బుధవారం ఉదయం జరిగినప్రమాదంలో ఓ కాంట్రాక్ట్ డ్రైవర్ గాయపడ్డారు. ఓబీ తొలగించే ప్రైవేటుకంపెనీలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న మొగిలి శ్రీకాంత్ వేకువజామున వోల్వోవాహనం నడుపుతూ వెళ్తుండగా, ఆగి ఉన్న మరో వోల్వో వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో శ్రీకాంత్ కుడికాలు తెగిపడింది. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

బాధితుడికి న్యాయం చేయాలి..

శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్‌లో బుధవారం ఉదయం జరిగిన ప్రమాదంలో గాయపడిన శ్రీకాంత్‌కు న్యాయం చేయాలని సింగరేణి కాంట్రాక్ట్‌వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్‌కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ అన్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కంపెనీ వోల్వోవాహనాలకు రేడియం స్టిక్కర్లు, ఇండికేటర్లు లేకపోవడంతో రాత్రిళ్లుడ్రైవర్లు ప్రమాదానికి గురవుతున్నారని ఆరోపించారు. కంపెనీయాజమాన్యం బాధ్యతవహించి, బాధితుడికి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

శ్రీకాంత్ కుటుంబాన్ని ఆదుకోవాలి..

గాయపడిన డ్రైవర్ మొగిలి శ్రీకాంత్‌ను కంపెనీ యాజమాన్యం ఆదుకోవాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దూలం శ్రీనివాస్, బి మధు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కాంట్రాక్టర్ అహంకార వైఖరి, అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. శ్రీకాంత్ కుటుంబానికి రూ.30లక్షల పరిహారం, సరైన వైద్యం అందించాలని వారు డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

బొగ్గు సంస్థలను పరిరక్షించడం కోసమే సమ్మె

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 14: దేశంలో ఉన్న బొగ్గు సంస్థలను పరిరక్షించడం కోసమే ఈనెల16న దేశవ్యాప్త ఒక్కరోజు సమ్మెకు పిలుపునిచ్చామని సీఐటీయూ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజు గోపాల్ పేర్కొన్నారు. బుధవారం ఏరియాలోని కేకే ఓసీపీ గనిపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో ఆయన కార్మికులనుద్దేశించి మాట్లాడారు. కొన్ని సంఘాలు సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి యాజమాన్యంతో చేతులు కలుపుతున్నాయని మండిపడ్డారు. అంతేకాకుండా యాజమాన్యం కూడా కార్మికులు సమ్మెలో పాల్గొనవద్దని, కార్మికులకు సమ్మెతో సంబంధం లేని ప్రచారం చేయడం సరికాదన్నారు. కేంద్రం అనుసరిస్తున్న పారిశ్రామిక విధానాలకు వ్యతిరేకంగా ఈ సమ్మె జరుగుతుందన్నారు. కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో అరీఫ్, వెంకటస్వామి,రాజేందర్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి హైడ్రాలిక్ వ్యాన్‌లు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 14: మందమర్రిలోని ఏరియా వర్క్‌షాప్ విద్యుత్‌విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది విధులకు అనువుగా యాజమాన్యం హైడ్రాలిక్ వ్యాన్‌లు అందుబాటులోకి తేవడం హర్షణీయమని గుర్తింపుసంఘం బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియాకార్యదర్శి భీమనాథుని సుదర్శన్ అన్నారు. బుధవారం ఏరియా వర్క్‌షాప్‌లో హైడ్రాలిక్ వ్యాన్‌లను పరిశీలించి మాట్లాడారు. గతంలో ఒకటే హైడ్రాలిక్ వ్యాన్ ఉండేదన్నారు. ప్రస్తుతం మూడు హైడ్రాలిక్ వ్యాన్‌లు ఏర్పాటు చేయడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ కార్మికులు విధులు నిర్వహించవచ్చని తెలిపారు.

సమ్మెకు దూరంగా ఉండండి: సీఎండీ

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 13: ఈనెల16న జరిగే దేశవ్యాప్త సమ్మెకు సింగరేణి ఉద్యోగులు దూరంగా ఉండాలని సీఎండీ ఎన్ బలరాం ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మె నోటీసులో అత్యధిక డిమాండ్లు సింగరేణి కార్మికులకు సంబంధించినవి కావని తెలిపారు. సింగరేణి పరిధిలో ఉన్న సమస్యలు చర్చల ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఇప్పటికే ఓబీ తొలగింపు, బొగ్గు ఉత్పత్తిలో వెనకబడి ఉన్నామని, ఉద్యోగులు ఈ విషయాన్ని గమనించి సమ్మెలో పాల్గొనకుండా సంస్థ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోవడానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సమ్మక్క గద్దెల వద్ద పోచమ్మ బోనాలు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 14: పట్టణంలోని పాలవాగు ఒడ్డున గల సమ్మక్కసారలమ్మ గద్దెల వద్ద బుధవారం సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలను నిర్వహించారు. ఈ నెల 21నుంచి 24వరకు నిర్వహించే జాతరలో భాగంగా పోచమ్మతల్లికి బోనాలతో మొక్కులు చెల్లించారు. ఈ పూజలకు మందమర్రి జీఎం మనోహర్ హాజరయ్యారు. పోచమ్మతల్లికి, సమ్మక్కసారలమ్మ గద్దెలకు పూజలుచేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శులు సలేంద్ర సత్యనారాయణ, దాగం మల్లేష్, ఆంజనేయులు, సంపత్ పాల్గొన్నారు.


రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ ఆర్కే-1ఏ పాలవాగు సమీపంలో గల సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా బుధవారం పోచమ్మతల్లికి మందమర్రి జీఎం మనోహర్ ఆధ్వర్యంలో బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ భక్తులు, కార్మిక కుటుంబాల సౌకర్యార్థం జాతరలో మంచినీరు, ఇతర ఏర్పాట్లను చేసినట్టు తెలిపారు. ఆర్కే-1ఏ మేనేజర్ జయంత్ కుమార్, ఏఐటీయూసీ నాయకులు సలేంద్ర సత్యనారాయణ పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. జాతరను ఈనెల 21నుంచి 24వరకు నిర్వహిస్తామన్నారు.

భర్తపై భార్య గొడ్డలితో దాడి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 14: పట్టణంలో కుటుంబ కలహాలతో భర్తపై భార్య గొడ్డలితో దాడి చేసిన సంఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్యతెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని బూడిదగడ్డ బస్తీకి చెందిన బూరుగు శంకర్, లతలకు 25 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. ఇటీవల కాలంలో శంకర్ మరో మహిళతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని అనుమానిస్తూ భర్తతో లత గొడవపడేది. మంగళవారం రాత్రి సైతం ఇద్దరు గొడవ పడ్డారు. శంకర్ నిద్రిస్తున్న సమయంలో అతడి భార్య గొడ్డలితో తలపై నరకడంతో తీవ్రగాయాలై కేకలు వేశాడు. దీంతో తండ్రి నిద్రలేచి వెంటనే కరీంనగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. లతపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

పంపకాలకు వేళాయే!

- ఢిల్లీలోని ఉమ్మడి ఆస్తుల విభజనకు ముందడుగు
- 19.781 ఎకరాలలో.. ఏపీకి 11.356, తెలంగాణకు 8.245 ఎకరాలు
- తెలంగాణ ప్రతిపాదనకు ఏపీ ఓకే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో రెండు తెలుగు రాష్ట్రాలకు ఉమ్మడిగా ఉన్న ఆస్తుల విభజనలో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఉమ్మడి(ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)భవన్ విభజనకు మార్గం సుగమమైంది. మొత్తం 19.781 ఎకరాలలో ఉన్న ఉమ్మడి భవన్ ఆస్తులలో ఏపీకి 11,356 ఎకరాలు, తెలంగాణకు 8.245 ఎకరాలు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు ఏపీ సర్కారు సుముఖత వ్యక్తం చేసింది. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ స్పందనను కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వానికి తెలియజేసింది. తెలంగాణ సీఎం ఎ.రేవంత్ రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చొరవతో గత నెలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ భవన్ అధికారులతో కేంద్ర హోంశాఖ కీలక సమావేశం నిర్వహించింది. అనంతరం ఉమ్మడి ఆస్తుల విభజనపై తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపింది. ఏపీ భవన్ కింద ఉన్న గోదావరి బ్లాక్ 4.315 ఎకరాలు, శబరి బ్లాక్‌తో పాటు అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణకు గురైన ప్రాంతం) ఉన్న 0.512 ఎకరాలు, నర్సింగ్ హాస్టల్ 3.359 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో 2.396 ఎకరాలు ఏపీకి ఇచ్చేలా ప్రతిపాదన చేశారు. అదే విధంగా శబరి బ్లాక్ కింద ఉన్న 3 ఎకరాలు, పటౌడీ హౌస్‌లో ఉన్న 5.245 ఎకరాలు తమకు కేటాయించేలా తెలంగాణ ప్రతిపాదన చేసింది. అయితే తమకు ప్రతిపాదించిన అంతర్గత రహదారులు, దుకాణాలు(ఆక్రమణలు) ఉన్న ప్రాంతం(0.512 ఎకరాలు) విలువ దాదాపు రూ.250 కోట్లు అని, ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోలేకపోతే అందుకు సరిసమానమైన భూమిని శబరి బ్లాక్ లేదా పటౌడీ హౌస్‌లోని భూమి నుంచి కేటాయించాలని ఏపీ షరతు విధించింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ వివరణ కోరుతూ కేంద్ర హోంశాఖ బుధవారం తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాసింది.

58:42 నిష్పత్తిలో పంపకాలు..

ఢిల్లీలోని ఉమ్మడి ఏపీ భవన్‌కు భూములు, భవనాలు సహా దాదాపు రూ.9,913.505 కోట్ల(దాదాపు పది వేల కోట్లు) విలువైన ఆస్తులు ఉన్నాయి. గోదావరి బ్లాక్, శబరి బ్లాక్, నర్సింగ్ హాస్టల్, పటౌడీ హౌస్ అనే విభాగాల కింద ఉమ్మడి భవన్ ఆస్తులు ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రానికి బయట ఉన్న ఆస్తులను రెండు తెలుగు రాష్ట్రాలు 58:42 నిష్పత్తిలో పంచుకోవాలని రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచారు. కాగా, భవన్ పంపకాలలో ఏపీకి 58.32శాతం, తెలంగాణకు 41.68 శాతం ఆస్తులు రానున్నాయి. తెలంగాణ ప్రభుత్వం పటౌడీ హౌస్‌లోని 5.245 ఎకరాల్లో నూతన తెలంగాణభవన్ నిర్మించేందుకు సిద్ధమవుతోంది.



తమ సోదరుడి పాడె మోస్తున్న మల్లు భట్టి విక్రమార్క, రవి

సోదరుడికి కన్నీటి వీడ్కోలు పలికిన భట్టి

- పాడె మోసి నివాళులు

వైరా, ఫిబ్రవరి 14: అనారోగ్యంతో మృతిచెందిన విశ్రాంత ఆయుష్ అదనపు డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు అంత్యక్రియలు బుధవారం ఆయన స్వగ్రామంలో అశ్రునయనాల మధ్య ముగిశాయి. డాక్టర్ వెంకటేశ్వర్లు సోదరులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి డాక్టర్ మల్లు రవి ఆయన పాడె మోసి నివాళులర్పించారు. అంత్యక్రియలకు ముందు డాక్టర్ మల్లు వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రతో ఆయన స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురానికి తీసుకువచ్చారు. గంటసేపు గ్రామస్తుల సందర్శనార్థం అక్కడ ఉంచారు. ఆ తర్వాత ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు.

రాష్ట్రంలో భారీగా అధికారుల బదిలీలు

- మునిసిపల్ కమిషనర్లు, వ్యవసాయశాఖలో అసిస్టెంట్ డైరెక్టర్లతో పాటు 95 మంది డీఎస్పీలకు స్థానచలనాలు
- జీహెచ్ఎంసీలో కమిషనర్ల బదిలీలు చర్చనీయాంశం

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అధికారుల బదిలీలు చేపట్టింది. ఈ మేరకు సంబంధిత శాఖలు బుధవారం ఉత్తర్వులు జారీ చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో విధులు నిర్వహిస్తున్న 114 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర మునిసిపల్‌శాఖ ఉత్తర్వులిచ్చింది. మంగళవారం 40 మంది కమిషనర్లను బదిలీ చేయగా బుధవారం మరో 74 మంది కమిషనర్లను బదిలీ చేస్తూ ఉత్తర్వులిచ్చింది. ప్రధానంగా జీహెచ్ఎంసీ పరిధిలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న మునిసిపల్ కమిషనర్ల బదిలీ చర్చనీయాంశమైంది. గత ప్రభుత్వ పెద్దల అండదండలతో ఏళ్లుగా జీహెచ్ఎంసీ పరిధిలో తిష్టవేసిన పలువురు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లకు స్థానచలనం కల్పించారు. అలాగే రాష్ట్ర వ్యవసాయశాఖలో పనిచేస్తున్న తొమ్మిది మంది అసిస్టెంట్ డైరెక్టర్లను బదిలీ చేస్తూ రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. మహబూబాబాద్ డీఏవోగా అభిమన్యు, భద్రాద్రి కొత్తగూడెం డీఏవోగా బి.బాబూరావు, సూర్యాపేట డీఏవోగా శ్రీధర్‌రెడ్డిని నియమించారు. పలు డివిజన్లకు ఏడీఏలను కూడా మార్చారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా సివిల్, తదితర విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న 95 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ రవిగుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం 110 మంది డీఎస్పీలు బదిలీ కాగా రెండో జాబితాలో మరో 95 మందిని బదిలీ చేశారు.

బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా రేపు సార్వత్రిక సమ్మె

బీజేపీ ప్రభుత్వ వైఫల్యాలపై ఫిబ్రవరి 16న నిర్వహించనున్న కార్మిక సమ్మె, గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతాంగ ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్, మతోన్మాద రాజకీయాలను వ్యతిరేకిస్తూ కేంద్ర ట్రేడ్ యూనియన్ సంఘాలు, రైతుసంఘాల ఐక్యవేదిక సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చాయని పేర్కొన్నాయి. ఈ మేరకు వామపక్ష పార్టీల తరఫున సీపీఐ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐఎంఎల్(ప్రజాపంథా) పోటు రంగారావు, సీపీఐఎంఎల్ (న్యూడెమోక్రసీ) చలపతిరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.



ప్రజాహిత యాత్రలో బండి సంజయ్

'కాళేశ్వరం' బాధ్యులను ఎందుకు అరెస్టు చెయ్యలే?

- ఎంపీ బండి సంజయ్

సిరిసిల్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ బృందం కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను సందర్శించి నివేదిక రూపొందించి చర్యలు తీసుకోవాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఆరోపించారు. కాళేశ్వరం బాధ్యులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. అంతేకాక, ఎన్నికల టికెట్ కోసం కన్నకొడుకు పేరునే మార్చేసిన ఘనుడు కేసీఆర్ అని విమర్శించారు. కేటీఆర్ అసలు పేరు కల్వకుంట్ల అజయ్‌రావు అని వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి మండలాల్లో బండి సంజయ్ బుధవారం ప్రజాహిత యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ తనకు టికెట్ ఇవ్వడం లేదని తెలుసుకున్న కేసీఆర్.. అజయ్‌రావును తీసుకెళ్లి మీ పేరే పెట్టుకున్నానని ఆయనకు చెప్పి టికెట్ తెచ్చుకున్న మోసగాడు కేసీఆర్ అని విమర్శించారు. అబద్ధాలు, మోసాల్లో కేటీఆర్ అయ్యను మించిపోయాడని ఎద్దేవా చేశారు. అయ్య(కేసీఆర్) ఏక్ నంబర్ అయితే కొడుకు(కేటీఆర్) దస్ నంబరని అన్నారు. తెలంగాణకు కేంద్రం పెద్ద ఎత్తున నిధులు ఇస్తోందని, రాజన్న సిరిసిల్ల జిల్లాకు రూ. 1,408 కోట్లు నిధులు ఇచ్చిందని తెలిపారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేస్తే రాముడికి ఓటు వేసినట్లేనని తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన బీజేపీ కొట్లాడితే కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వడం న్యాయమా? అని అడిగారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితి లేదని, ఎన్నికల కోడ్ నెపంతో ఆ పార్టీ నేతలు తప్పించుకునే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు.

రాష్ట్రంలో 2 లక్షల మందికి 'ముఫ్త్ బిజిలీ'!

(మొదటి పేజీ తరువాయి)

యూనిట్ల వినియోగం	సోలార్ ప్లాంట్	వ్యయం	కేంద్రం సబ్సిడీ	వినియోగదారుడు భరించాల్సింది
0-100	1 కిలోవాట్	రూ.60 వేలు	రూ.30 వేలు	రూ.30 వేలు
150	2 కిలోవాట్లు	రూ.1.10 లక్షలు	రూ.60 వేలు	రూ.50 వేలు
300	3 కిలోవాట్	రూ.1.65 లక్షలు	రూ.78 వేలు	రూ. 87 వేలు

తొలిదశలో భాగంగా 34,59,585 మందికి ఉచితంగా విద్యుత్‌ను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఇదే సమయంలో ప్రధాని మోదీ ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజన రాష్ట్రంలో సంపూర్ణంగా అమలయితే దాదాపు 2 లక్షల మందికి లబ్ధి చేకూరవచ్చని సంబంధిత అధికారవర్గాలు తెలిపాయి. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వంపై గృహజ్యోతి భారం స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, ప్రతీ నెల 150 యూనిట్ల దాకా విద్యుత్ వినియోగించేవారికి 1-2 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకోవటానికి అవకాశం ఉంది. దీనికి రూ.1.10 లక్షలు వ్యయం కానుండగా... రూ.60 వేలు సబ్సిడీ లభిస్తుంది. మిగిలిన రూ.50 వేలు సొంతంగా పెట్టుకోవాలి. 150 యూనిట్ల విద్యుత్ వాడకానికి నెలకు రూ.700 దాకా బిల్లు వచ్చే అవకాశం ఉండగా... సోలార్ యూనిట్‌తో రూ.625 మేర ఆదా అవుతుందని, బిల్లు కేవలం రూ.75 మాత్రమే చెల్లించే పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. కేంద్ర పథకం కింద రూఫ్‌టాప్ (ఇంటి పైకప్పు మీద) సోలార్ యూనిట్లు పెట్టుకుంటే... వేసవిలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా విద్యుత్తు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది. ఈ విద్యుత్‌ను సొంతంగా వాడుకోవచ్చు లేదా డిస్కమ్‌లకు విక్రయించుకోవచ్చు. చీకటిపడ్డాక సౌరవిద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుంది కాబట్టి ఆ సమయంలో బ్యాటరీలో నిల్వ చేసిన కరెంట్‌ను లేదా డిస్కమ్‌లు సరఫరా చేసే కరెంట్‌ను వాడుకోవాల్సి ఉంటుంది. కాగా, వినియోగదారుల నుంచి కొనుగోలు చేసే విద్యుత్ ధరను కేంద్రం ఖరారు చేయనుంది.

ముఫ్త్ బిజ్లీ యోజన

ముఫ్త్ బిజ్లీ యోజనలో ఒక కిలోవాట్ సోలార్ ప్లాంట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు లేదా అంతకన్నా ఎక్కువ కిలోవాట్ సోలార్ ప్లాంట్లకు రూ.78 వేలు సబ్సిడీ లభిస్తుంది.

భారీగా పెరిగిన సబ్సిడీ

సోలార్ రూఫ్‌టాప్ పథకం ప్రారంభించిన కొత్తలో కేంద్రం 3 కిలోవాట్లదాకా 40 శాతం సబ్సిడీ ఇస్తుండేది. అయితే, క్రమేణా దీనిని తగ్గించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ప్రతి కిలోవాట్‌కు రూ.18 వేల చొప్పున 3 కిలోవాట్లకు రూ.54 వేలు సబ్సిడీ ఇస్తున్నారు. 3 కిలోవాట్ల నుంచి 10 కిలోవాట్ల దాకా కిలోవాట్‌కు రూ.9 వేల చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. ఇక అపార్టుమెంట్లు వంటి గ్రూప్ హౌసింగ్‌కు కిలోవాట్‌కు రూ.9 వేల దాకా సబ్సిడీ లభిస్తోంది. అయితే, ప్రస్తుతం ప్రకటించిన ముఫ్త్ బిజిలీ యోజనలో సబ్సిడీని భారీగా పెంచారు. ఈ పథకం కింద సోలార్ ప్లాంట్ ఏర్పాటు కోసం http://pmsuryaghar.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వ ఆమోదం లభించిన తర్వాత ఇంటి పైకప్పు మీద సోలార్ యూనిట్ పెట్టుకోవచ్చు. దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్-హైదరాబాద్) పరిధిలో 80 మంది, ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్-వరంగల్) పరిధిలో 82 మంది సోలార్‌ప్లాంట్ విక్రేతలు ఉన్నారు.

బీఆర్ఎస్‌కు షాక్

కాంగ్రెస్‌లో చేరిన 36 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు

కొత్తగూడెం టౌన్/వైరా/సూర్యాపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌కు భారీ షాక్ తగిలింది. కొత్తగూడెం, సూర్యాపేట మునిసిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు పార్టీ ఫిరాయించారు. కొత్తగూడెం మునిసిపాలిటీలో బీఆర్ఎస్‌కు చెందిన ఓ కౌన్సిలర్‌తో పాటు పలువురు మహిళా కౌన్సిలర్ల భర్తలు, బంధువులు సుమారు 20 మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరంతా బుధవారం ఖమ్మం జిల్లా వైరాలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నాయకులకు ఏఐసీసీ పరిశీలకుడు రోహిత్‌చౌదరి కాంగ్రెస్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ నెల 19న కొత్తగూడెం చైర్‌పర్సన్ సీతాలక్ష్మిపై అవిశ్వాస తీర్మానం పెడుతున్న నేపథ్యంలో బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరడం రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, ఎన్నో హై డ్రామాల మధ్య సూర్యాపేట మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని బీఆర్ఎస్ నిలబెట్టుకున్నప్పటికీ బీఆర్ఎస్ అసమ్మతి కౌన్సిలర్లు మాత్రం చేజారిపోతున్నారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పదవిని ఆశించిన 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలను, ఆమె భర్త దిలీప్‌రెడ్డిని బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడంతో 16 మంది అసమ్మతి కౌన్సిలర్లు బుధవారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

గ్రామీణ భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలి

నెన్నెల, ఫిబ్రవరి 14: దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా ఈ నెల 16న తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్ పిలుపునిచ్చారు. సమ్మెకు మద్దతుగా మండలంలోని గుండ్లసోమారంలో బుధవారం ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు రత్నం తిరుపతి, జిల్లానాయకులు దుగుట రెడ్డి, రాజక్క, గంగారాం, గున్నక్క, అఫ్రీనా, బక్కయ్య, శ్రీనివాస్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో భర్తపై కేసు నమోదు

కాసిపేట, ఫిబ్రవరి 14: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోమటిచేనుకు చెందిన వసంత, 11 నెలల కొడుకు బిందుమాధవ్‌పై డీజిల్ పోసి నిప్పంటించిన కేసులో వసంత ఫిర్యాదుమేరకు భర్త వెంకటేష్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు కాసిపేట ఎస్సై గంగారాం తెలిపారు. భార్య భర్తల మధ్య గత నాలుగు నెలలుగా మనస్పర్థలు ఏర్పడ్డాయి. వసంత కోమటిచేనులోని తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. బుధవారం ఉదయం కోమటిచేనుకు వచ్చికు వచ్చి నిద్రిస్తున్న భార్య వసంత,కొడుకు బిందుమాధవ్‌పై డీజిల్ పోసి నిప్పంటించి పారిపోయాడు. వసంత కేకలు వేయడంతో స్థానికులు గమనించి మంటలను ఆర్పడంతో ప్రాణాపాయం తప్పింది. భార్య వసంత ఫిర్యాదు మేరకు భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వానరానికి అంత్యక్రియలు



వానరాన్ని ఊరేగిస్తున్న కుటుంబ సభ్యులు

భీమిని, ఫిబ్రవరి 14: మండలంలోని ఖర్జిభీంపూర్ గ్రామంలో బుధవారం హిందూ సంప్రదాయం ప్రకారం వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. 2000 సంవత్సరం లో ఠాకూర్ ఉదయ్ సింగ్ ఇంటికి ఓ వానరం వచ్చింది. అప్పటి నుంచి వానరాన్ని గుల్లు అనే పేరుతో పిలుచుకుంటూ అల్లారు ముద్దుగా చేసుకుంటున్నారు. 24 ఏళ్ల పాటూ దాని ఆలనాపాలనా చూసుకున్నారు. వానరం అనారోగ్యానికి గురైతే వెంటనే పశువుల ఆసుపత్రులకు తీసుకెళ్లి చికిత్స చేయించేవారు. కొంత కాలం క్రితం వానరానికి పక్షవాతం వచ్చింది. అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. దీంతో కుటుంబ సభ్యులు హిందూ సంప్రదాయం ప్రకారం ఊరేగింపుగా తీసుకెళ్లి ఖననం చేశారు.

కలప దుంగలు పట్టివేత

బెల్లంపల్లి, ఫిబ్రవరి 14: బెల్లంపల్లిలో అక్రమంగా తరలిస్తున్న ఏడు కలప దుంగలను పట్టుకున్నట్లు ఎఫ్ఆర్వో సుభాష్ తెలిపారు. ఆసిఫాబాద్ నుంచి కారులో అక్రమంగా కలప తరలిస్తున్నారని సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. పట్టుకున్న కలప విలువ సుమారు రూ. 35 వేలు ఉంటుందని తెలిపారు. దాడిలో డిప్యూటీ ఆర్వో గౌరి శంకర్, ఎఫ్ఎస్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

బెల్లంపల్లి, ఫిబ్రవరి 14: బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా గోపు మల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ బెల్లంపల్లి పట్టణ అభివృద్ధికి కౌన్సిలర్లు, ప్రజలందరు సహకరించాలని కోరారు. మున్సిపల్ ఉద్యోగులు కమిషనర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

బెల్లంపల్లి, ఫిబ్రవరి 14: మండలంలోని కన్నాల బుగ్గ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో బుధవారం వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితులు శ్రీరాంభట్ల వేణుగోపాలశాస్త్రి, సతీష్‌వర్మ ఆధ్వర్యంలో కార్యక్రమంలో నిర్వహించారు. కలెక్టర్ బదావత్ సంతోష్ దంపతులు హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ఎమ్మెల్యే చిన్నయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులు కారుకూరి రాంచందర్, నాతరి స్వామి, మునిమంద రమేష్, ధ్వజస్తంభ దాత సుంకరి రాజేష్-రాజేశ్వరి, బుగ్గ ఆలయ కమిటీ చైర్మన్ మాసాడి శ్రీదేవిశ్రీరాములు, ధర్మకర్తలు వెంకటస్వామి, అభినవ సంతోష్ పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు

కాసిపేట, ఫిబ్రవరి 14: ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో నాగోబా జాతరలో నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. వాలీబాల్ టోర్నీలో మండలంలోని దేవాపూర్ జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో దేవాపూర్, ఉట్నూరు మండలంలోని ముత్తిడిగూడెం జట్లు తలపడ్డాయి. దేవాపూర్ జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో వసంతరావు, తుడుందెబ్బ గౌరవాధ్యక్షుడు ఆత్రం జంగు, సేకనాథ్, సిడాం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

- వివాహేతర సంబంధంతోనే ఘాతుకం
- వివరాలు వెల్లడించిన డీసీపీ సుధీర్‌రాంనాథ్‌కేకన్



మాట్లాడుతున్న డీసీపీ సుధీర్‌రాంనాథ్‌కేకన్

మహేందర్ (ఫైల్)

ఏసీసీ, ఫిబ్రవరి 14: చెన్నూరు మండలం కమ్మరిపల్లిలో మంగళవారం రాత్రి జరిగిన హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్‌కేకన్ అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య కేసులో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ చెన్నూరు మండలం పొన్నారం గ్రామానికిచెందిన రామగిరి మహేందర్‌కు అదే గ్రామానికి చెందిన బట్టె పద్మ అనే వివాహితతో ఐదేళ్లుగా వివాహేతర సంబంధం కలిగి ఉన్నాడన్నారు. నాలుగు నెలల క్రితం మహేందర్, పద్మ ఎవరికి చెప్పకుండా గ్రామం విడిచి వెళ్లిపోయారని చెప్పారు. కుటుంబీకులు చెన్నూరు పోలీస్‌స్టేష న్‌లో పద్మ మిస్సింగ్‌పై ఫిర్యాదు చేశారని వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని చెప్పారు. ఇద్దరు కలిసి ఉన్న సమయంలో వారి మధ్య మనస్పర్థలు రావడంతో పద్మ మహేం దర్‌ను వదిలేసి కమ్మరిపల్లిలోని తల్లిదండ్రుల వద్ద కొన్ని రోజులుగా ఉంటుందని తెలిపారు.దూరంగా ఉంటున్నప్పటికీ మహేందర్ అప్పుడప్పుడు పద్మ తల్లిదండ్రుల ఇంటికి వచ్చి వేధిస్తున్నారు. దీంతో పద్మపోలీసులను ఆశ్రయించిందన్నారు. ఈ క్రమంలో పోలీసులు మహేందర్‌కు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అయినా మహేందర్ పద్ధతి మార్చుకోకపోవడంతో విసుగు చెందిన పద్మ తన భర్త బట్టె శేఖర్, తండ్రి మొగిలి ఓదెలు, తల్లి మొగిలి సుగుణక్కలతో కలిసి పథకం ప్రకారం మంగళవారం రాత్రి మహేందర్‌ను కమ్మరిపల్లిలోని తన ఇంటికి రమ్మని ఫోన్ చేసింది. మహేందర్ రాత్రి పది గంటలకు పద్మ ఇంటికి వెళ్లాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న పద్మ, ఆమె భర్త , తల్లిదండ్రులు కలిసి మహేందర్‌ను కట్టెలతో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలపాలై అక్కడే మృతిచెం దాడని తెలిపారు. సాక్ష్యాధారాలను చెరిపివేయాలనే ఉద్దేశ్యంతో రక్తం మరకలు తుడిచి వేసి ఎడ్లబండిలో మహేందర్ మృతదేహాన్ని కమ్మరపల్లికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అడవికి పద్మభర్త శేఖర్, తండ్రి ఓదెలు తీసుకువెళ్లి కాల్చివేశారన్నారు. విషయాన్ని మహేందర్ మిత్రులు అన్న రామగిరి రవీందర్‌కు తెలియజేయడంతో రవీందర్ పోలీసులకు సమాచారం అందించారని చెప్పారు. బంధువులతో అడవిలోకి వెళ్లి కాలిన మృతదేహాన్ని చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడని తెలిపారు. మృతుని అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్య, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం చెన్నూరు ఇన్‌స్పెక్టర్ కేసు నమోదు చేశారని డీసీపీ తెలిపారు. నిందితులు వేరే ఊరికి పారిపోవడానికి బుధవారం చెన్నూరు బస్టాండ్ వద్ద ఉన్నారనే సమాచారంమేరకు జైపూర్ ఏసీపీ మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకున్నారని తెలిపారు. ఈ మేరకు బట్టె పద్మ, బట్టె శేఖర్, మొగిలి ఓదెలు, మొగిలి సుగుణక్కలను అరెస్టు చేసినట్లు డీసీపీ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. 24 గంటల్లోనే నిందితులను అరెస్టు చేసినందుకు జైపూర్ ఏసీపీ మోహన్, చెన్నూరు పోలీసులను డీసీపీ అభినందించారు.

మోసగించిన వారిపై చర్యలు తీసుకోవాలి

ఏసీసీ, ఫిబ్రవరి 14: మంచిర్యాల మున్సిపాలిటీలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తూ వయస్సు పైబడినవారి స్థానాల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని డబ్బులు వసూలు చేసిన ఓ సంఘం నాయకులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు అన్నారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, వైస్ చైర్మన్ సల్ల మహేష్‌లకు వినతి పత్రం అందజేశారు. 9 మంది కార్మికుల నుంచి డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అశోక్‌తేజ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నస్పూర్, ఫిబ్రవరి 14: నస్పూర్ మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించి కనీస వేతనం అమలు చేయాలని యూనియన్ అధ్యక్షుడు కొయ్యల వెంకటి ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ సుర్మిళ్ల వేణుకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన అదనంగా పెంచిన వెయ్యి రూపాయల వేతనంను మున్సిపల్ కౌన్సిల్ సమావేశం తీర్మానం చేసి అమలు చేయాలని విన్నవించారు. వయస్సు పైబడిన వారి స్థానంలో కుటుంబంలో ఒక్కరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం రూ.26వేలను ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు పద్ధతి ద్వారా కొనసాగుతున్న కార్మికులకు రూ.15వేల ఇవ్వాలని, కార్మికులందరికి పెండింగ్ వేతనాలతో పాటు ఇపీఎఫ్, ఈఎస్ఐ వెంటనే ఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మద్దిశ్ల సతీష్, హబీబ్, శంకర్, దుర్గయ్య, రమేశ్, రాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటాం

- ఎంపీడీవో గుర్రం సత్యనారాయణ
- జిల్లాలో పలువురు బాధ్యతల స్వీకరణ



జైపూర్ ఎంపీడీవోను సన్మానిస్తున్న కార్యదర్శులు

జైపూర్, ఫిబ్రవరి 14: ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని ఎంపీడీవో గుర్రం సత్యనారాయణ అన్నారు. జైపూర్ ఎంపీడీవోగా బుధవారం గుర్రం సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన పి సత్యనారాయణ కుమరంభీం జిల్లాకు బదిలీ అయ్యారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి గుర్రం సత్యనారాయణ బదిలీపై వచ్చారు. ఎంపీడీవోను కార్యదర్శులు శాలువాలతో సన్మానించారు.

దండేపల్లి: దండేపల్లి ఎంపీడీవోగా జగర్లముడి ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన వేముల మల్లేశం కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలానికి బదిలీపై వెళ్లారు.

భీమిని: భీమిని ఎంపీడీవోగా గంగ మోహన్ బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. నాగర్ కర్నూల్ జిల్లా నుంచి మండలానికి ఆయన బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ పని చేసి న జవహర్‌లాల్ ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలానికి బదిలీ అయ్యారు.

కాసిపేట: కాసిపేట ఎంపీడీవోగా సత్యనారాయణసింగ్ బుధవారం కార్యాలయంలో బాధ్య తలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన అలీం బదిలీపై పెద్దపల్లి జిల్లా అంతర్గాంకు వెళ్లగా, కుంరంభీంఆసిఫాబాద్ జిల్లాలోని తిర్యాణి మండల ఎంపీడీవోగా పనిచేసిన సత్యనారాయణసిం గ్ బదిలీపై కాసిపేటకు వచ్చారు. ఎంపీడీవోను సన్మానించా రు. కార్యక్రమంలో స్వామి, తిరుపతి, ఏపీవో నవీన్‌కుమార్, ఐకేపీ, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి ఎంపీడీవోగా న్యాటెంకి రాజేశ్వర్ బుధవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆసిఫాబాద్ జిల్లా నుంచి బదిలీపై మందమర్రికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన మందమర్రి ఎంపీడీవో శశికళ బదిలీపై పెద్దపల్లి జిల్లాకు వెళ్లారు.

జన్నారం: జన్నారం ఎంపీడీవో అరుణరాణి బదిలీపై వెళ్లగా బుధవారం బదిలీపై వచ్చిన శశికళ బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆమెను అభినందించారు.

హాజీపూర్: హాజీపూర్ ఎంపీడీవోగా మధుసూదన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మధుసూదన్ కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూరు(యు) నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపీడీవో అబ్దుల్ హై గుడిహత్నూర్‌కు బదిలీ అయ్యారు.

తాండూర్: తాండూర్ ఎంపీడీవోగా శ్రీనివాస్ బుధవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ప్రవీణ్‌కుమార్ కు మరంభీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఎంపీడీవో శ్రీనివాస్‌కు సిబ్బంది స్వాగతం పలికారు.

ఎఫ్ఎస్‌వోల పర్యటన

జన్నారం, ఫిబ్రవరి 14: కవ్వాల టైగర్ జోన్‌లోని జన్నారం డివిజన్‌లో బుధవారం హైదరాబాద్‌లోని దూలపల్లి అటవీ శిక్షణ కేంద్రానికి చెందిన ట్రైనీ ఎఫ్ఎస్‌వోలు పర్యటించారు.టైగర్ జోన్‌లోని గొండుగూడెం, మల్యాల, బైసన్‌కుంట, మైసమ్మకుంట తదితర ప్రాంతాల్లో పర్యటించి కవ్వాల టైగర్ జోన్‌లో చేపడుతున్నవన్య ప్రాణుల సంరక్షణను పరిశీలించారు. ఆహారం, దాహార్తి తీర్చుకునేందుకు ఏర్పాటు చేసిన గ్రాస్ ప్లాంట్లు, నీటి క్షేత్రాలను పరిశీలించారు. అటవీ , వన్యప్రాణుల సంర క్షణకు తీసుకుంటున్న చర్యలపై ఎఫ్ఆర్వో హఫీజుద్దీన్ వారికి వివరించారు. అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి


హాజీపూర్, ఫిబ్రవరి 14 : ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని జిల్లా రవాణా శాఖ అధికారి కిష్టయ్య అన్నారు. జనవరి 15 నుంచి చేపట్టిన జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆర్టీవో కార్యాలయంలో వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంవీఐ వివేకానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీల రద్దు

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 14: మంచిర్యాల జిల్లాలో బెల్లంపల్లి, జన్నారం మార్కెట్ కమిటీల పాలకవర్గాలు రద్దయ్యాయి. రద్దయిన మార్కెట్ కమిటీలు తమ చేతికి చిక్కనున్న నేపథ్యంలో ఆయా మార్కెట్ల పరిధిలోని కాంగ్రెస్ నాయకుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

కాసిపేట, ఫిబ్రవరి 14: చిన్న ధర్మారం పంచాయతీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ భోజన్న తెలిపారు. ప్రజలు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరగా బుధవారం గ్రామంలో తహసీల్దార్ పర్యటించారు. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. నల్లాలను పునరుద్ధరించి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ముర్తుజా, సిరాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.





మామిడి మార్కెట్‌కు మోక్షమెప్పుడు?

- పనులు పూర్తయినా ప్రారంభించని అధికారులు
- ఏళ్లతరబడి తప్పని ఎదురు చూపులు
- విక్రయం కోసం మహారాష్ట్రకు తరలుతున్న పంట
- ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని రైతుల ఆవేదన

మంచిర్యాల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లాలో మామిడి రైతులు పండించిన పంటను అమ్ముకొనేందుకు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. స్థానికంగా మామిడి మార్కెట్ యార్డు లేకపోవడంతో పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రకు పంటను తరలించి విక్రయిస్తూ ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి ఈ పరిస్థితి నెలకొన్నా పట్టించుకునే వారు కరువయ్యారు. మామిడి రైతుల సౌకర్యార్థం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో నిర్మించిన మార్కెట్ యార్డు పనులు పూర్తి చేసి ఏడేళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ సమీపంలో 2015లో అప్పటి రాష్ట్ర మార్కెటింగ్ శాఖ మంత్రి హరీష్‌రావు మామిడి మార్కెట్ యార్డును మంజూరు చేశారు. ఐదెకరాల స్థలాన్ని మామిడి మార్కెట్ యార్డుకు కేటా యించడంతోపాటు భవనం పనుల కోసం రూ. 1.26 కోట్లు మంజూరు చేశారు. అందులో సుమారు 10వేల టన్నుల సామర్థ్యంగల రెండు షెడ్లు నిర్మించారు. 2016లో పనులు పూ ర్తయ్యాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన మార్కెట్ యార్డు ప్రారంభానికి నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది.

● 19 వేల ఎకరాల్లో..

మంచిర్యాల జిల్లాలో 19 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉ న్నాయి. మామిడి రైతులకు దిగుబడులను మార్కెట్‌కు తరలించడం పెద్ద సమస్యగా మారింది. పంట అమ్ముకోవడానికి రానుపోను 600 కిలోమీట ర్లకు పైగా ప్రయాణించాల్సి వస్తోంది. కాయలు మార్కెట్‌కు చేరే సరికి ఖర్చులు తడిసి మోపెడవుతాయి. వ్యాన్ కిరాయి రూ. 22 వేల నుంచి 25 వేలు, దళారీ కమీషన్ 15 శాతం, కాయల్లో ఒక టన్నుకు ఒక క్వింటాలు తరుగు, దారి ఖర్చులు, మార్కెట్ శిస్తు, నాలుగు చోట్ల చెక్ పోస్టులకు సొమ్ము చెల్లించాల్సి వస్తోంది. దీంతో ఒక్క వ్యాన్‌కు రైతుపై రూ.40 వేల నుంచి రూ. 45 వేల వరకు అదనపు భారం పడుతోంది. దీనికి తోడు ఏపీ, టీఎస్ పాసింగ్ వాహనాలు కనబడితే మహారాష్ట్ర పోలీసులు లేని పోని ధ్రువీకరణ పత్రాలు అడిగి ఇక్కడి రైతులను వేధిస్తుంటారు. పచ్చి కాయ మార్కెట్‌కు అందడంలో ఆలస్యం అయితే నష్టపోతామనే ఉద్దేశ్యం తో పోలీసుల చేతులు తడపాల్సిందేనని రైతులు వాపోతున్నారు. దీంతో ఆరుగాళం కష్టపడి పండించిన రైతులు నష్టపోతుండగా వ్యాపారులు, దళారులు కోట్లు గడిస్తున్నారు. స్థానికంగా మార్కెట్ ఏర్పాటు చేస్తే రైతు లకు అధిక వ్యయ ప్రయాసలు తప్పడంతో పాటు ప్రభుత్వానికి కూడా ఆదాయం సమకూరుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఇప్ప టికైనా ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి జిల్లాలో మామిడి మార్కె ట్ యార్డును ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

● మార్కెట్ అందుబాటులో లేక..

జిల్లాలో కొనుగోలు చేసేందుకు మార్కెట్ అందుబాటులో లేకపోవడంతో రైతులు మామిడి పంటను మహారాష్ట్రలోని నాగ్‌పూర్, చంద్రపూర్‌తో పాటు, ముంబయికి వెళ్లి విక్రయిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో గిట్టుబాటు ధర లభించక దళారుల చేతిలో రైతులు తీవ్రంగా నష్టపోవలసిన పరిస్థితులు నెలకొన్నాయి. పంట విక్రయం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన జిల్లా మామిడి రైతులు నిలువు దోపిడీకి గురవుతున్నారు. ఎక్కువ మంది మహారాష్ట్రలోని నాగపూర్‌కు వెళ్లి మోసపోతున్నారు. ఇక్కడ అమ్ముకునే సౌకర్యం లేక పోవడం పొరుగు వ్యాపారులకు వరంగా మారింది. అక్కడి వ్యా పారులు సిండికేట్‌గా మారి మామిడి రైతు లను నిండా ముంచుతున్నారు. జిల్లాలో సాగువుతున్న మామిడి పంటలో 80 శాతం నాగపూర్‌కు తరలిస్తారు. అక్కడి మార్కెట్లో రైతులను కమీషన్ ఏజెంట్ల బెడద వెంటాడుతోంది. మంచిర్యాల జిల్లాలో పండిన మామిడికి దేశ విదేశాల్లో మంచి డిమాండ్ ఉంటుంది. రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకుండా సహజ పద్ధతిలో పండించడంతో ఇష్టంగా కొనుగోలు చేస్తారు. అలాంటి మామిడి కాయలను వ్యాపారులు సిండికేట్‌గా మారి ఎక్కువ ధర పెట్టవద్దని తీర్మానించుకుని ధరలను అమాంతం దించేస్తుంటారు.

రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి అదే సరకును ఇతర రాష్ట్రాలకు అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటారు. రైతులు దోపిడీకి గుర వుతుండగా వ్యాపారులు కోట్లు గడిస్తున్నారు. అక్కడ ప్రతి రోజు వేలం పాట నిర్వహించి ఏరో జుకారోజు ధర నిర్ణయిస్తారు. తకక్‌పట్టి (రశీదు) చేతికి వచ్చే సరికి ఏ రకానికి ఎంత ధర వేశారో తెలియనే తెలియదు. ఒక సారి మార్కెట్‌లో అడుగు పెట్టిన తర్వాత మళ్లీ పంట ఉత్పత్తులతో తిరిగి వచ్చే అవకాశం లేక పోవడంతో కమీషన్ ఏజెంట్ ఏ ధర పెడితే అధరకు తెగనమ్ము కోవాల్సిన దుస్థితి మామిడి రైతులకు పట్టింది. ధర నిర్ణయం దళారుల దయాదాక్షిణ్యాల పైనే ఆధారపడి ఉందని రైతులు వాపోతున్నారు.

ఈవీఎంల మొదటి దశ తనిఖీ

- జిలా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్



ఈవీఎంలను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 14: భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో చేపట్టిన ఎలక్ట్రానిక్ ఓటింగ్‌యంత్రాల మొదటి దశ తనిఖీ పూర్తి చేశామని జిలా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని ఈవీఎం గోదాములో కొనసాగుతున్న ఈవీఎం మొదటి దశ తనిఖీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూలోక్‌సభ ఎన్నికల దృష్ట్యా భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మొదటి దశ తనిఖీ నిర్వహించామని చెప్పారు. పది రోజులుగా తనిఖీ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో 1.074 బ్యాలెట్ యూనిట్‌లు, 963 కంట్రోల్ యూనిట్‌లు, 1,080 వీవీ ప్యాట్‌లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మొదటి దశ తనిఖీలో 1,063 బ్యాలెట్ యూనిట్‌లు, 960 కంట్రోల్ యూనిట్‌లు, 1,079 వీవీ ప్యాట్‌లను పరిశీలించి సక్రమంగా ఉన్నాయని నిర్ధారించామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, ఎన్నికల విబాగం అధికారులు పాల్గొన్నారు.

హోటల్ నార్తిన్ ప్రారంభం



హోటల్ నార్తిన్‌ను ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ

ఏసీసీ, ఫిబ్రవరి 14: మంచిర్యాల పట్టణంలోని బెల్లంపల్లిచౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన హోటల్ నార్తిన్‌ను బుధవారం మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, జడ్పీ ఛైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ నిర్వహకులు నల్ల శ్రీనివాస్, ఒల్లేటి సీతారామయ్య, రాంపెల్లి వెంకటరమణచారి, సురేష్ కుమార్ మార్ధలు మాట్లాడుతూ నార్తిన్ హోటల్‌లో తందూరి కౌంటీ సెంటర్, అడ్వాన్స్‌డ్ చైనీస్, సౌతిండియన్, ఇంటర్నేషనల్ వంటకాలు నాణ్యతతో ఆహార ప్రియులకు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కాఫీస్, బర్గర్‌లు, పిజ్జాలు లభిస్తాయన్నారు. రెస్టారెంట్, హోటల్‌లో కెఫే, రూమ్స్, బ్యాంకెట్‌హాల్స్, పార్టీ కాన్ఫరెన్స్ హాలు, ఓపెన్ టెర్రస్ స్విమ్మింగ్‌పూల్, విజిటర్స్ వెయిటింగ్‌లాబీ, జిమ్ తదితర అత్యాధునిక వసతులు, ఆధునిక హంగులతో తీర్చిదిద్దామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు దివాకర్‌రావు, ఓదెలు, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాద్, మున్సిపల్ ఛైర్మన్ రావుల ఉప్పలయ్య, మాజీ వైస్ ఛైర్మన్‌లు నల్ల శంకర్, గాజుల ముకేష్‌గౌడ్, నీలి శ్రీనివాస్, మల్లయ్య పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థులను గెలిపించాలి



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్

నస్పూర్, ఫిబ్రవరి 14: పార్లమెంట్ ఎన్నికల్లో సింగరేణి కార్మికుల సమస్యలను పరిష్కరిం చేందుకు కృషి చేసేందుకు బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. నస్పూర్ పట్టణ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమా వేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రఘునాథ్ మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గం నుంచి బరిలో ఉండే వ్యక్తిని గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని కోరారు. తద్వారా కార్మి కుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తారన్నారు. మోదీ ప్రభుత్వం తిరగి మూడో సారి కేంద్రంలో అధికారం చేపట్టడం ఖాయమని చెప్పారు. సింగరేణి కార్మికుల, కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై బీజేపీ పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రజనీస్ జైన్, దుర్గం అశోక్, కమలాకర్ రావు, తోట మల్లికార్జున్, పట్టణ అధ్యక్షుడు రమేశ్ పాల్గొన్నారు.

● పట్టణ కమిటీల నియామకం..

భారతీయ జనతా పార్టీ నస్పూర్ పట్టణ పూర్తి స్థాయి కమిటీని నియమించారు. పట్టణ ప్రధాన కార్యదర్శులుగా ఈర్ల సదానందం, పొన్నవేణి సదయ్య, కుర్ర చక్రవర్తి, ఉపాధ్యక్షులుగా సామ్రాజ్ రమేశ్, మామిడి శెట్టి మహేష్, అంబాల సాగర్, మారిశెట్టి కుమారస్వామి, బుద్దె మహేశ్వరి, కోశాధికారిగా రాజకొండ సత్యనారాయణను ఎన్నుకున్నారు. పట్టణ యువ మోర్చా అధ్యక్షుడుగా రాగిడి రవి, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలిగా ముత్తినేని తిరుమల, ఎస్సీ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా సిరికొండ రాజు, గిరిజన మోర్చా పట్టణ అధ్యక్షుడిగా సీడాం తిరుపతి ఎన్నికయ్యారు. బీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడిగా బద్రి శ్రీకాంత్, పట్టణ మీడియా సెల్ అధ్యక్షుడిగా మోతె కనకయ్య, పట్టణ లీగల్ సెల్ అధ్యక్షుడిగా చెరుకు మోహన్ దాస్, పట్టణ వాణి జ్య సెల్ అధ్యక్షుడిగా గాంధ్ర మధుసూదన్‌రావు, పట్టణ కార్మిక సెల్ విభాగం అధ్యక్షుడిగా గంగిపెల్లి రాములును నియమించారు.

రేపు జడ్పీ సర్వసభ్య సమావేశం

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 14: జిల్లా కేంద్రంలోని జిల్లాప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నామని జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గణపతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సభ్యులు, అరుధికారులు హాజరు కావాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్

నస్పూర్, ఫిబ్రవరి 14: నస్పూర్ తహసీల్దార్‌గా పిప్పరి శ్రీనివాస్ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేసిన వనజారెడ్డిని జైపూర్‌కు బదిలీపై వెళ్ళగా ఇక్కడకు జయ శంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో పని చేస్తున్న తహసీల్దార్‌ను ఇక్కడకు బదిలీ చేశారు.

జైపూర్: జైపూర్ నూతన తహసీల్దార్‌గా వనజారెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ రమేశ్‌బాబు వేమనపల్లికి బదిలీ అయ్యారు. నస్పూర్ నుంచి వనజారెడ్డి బదిలీపై జైపూర్‌కు వచ్చారు.

భీమారం: భీమారం తహసీల్దార్‌గా సదానందం బాధ్య తలు స్వీకరించారు. వేమనపల్లి తహసీల్దార్‌గా పనిచేసిన సదానందం బదిలీపై భీమారంకు వచ్చారు.

జన్నారం: జన్నారం తహసీల్దార్ వేణుగోపాల్ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వచ్చిన తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

తాండూర్: తాండూర్ తహసీల్దార్‌గా ఇమ్రాన్‌ఖాన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నెన్నెల నుంచి ఈయన బదలీపై తాండూర్‌కు వచ్చారు. తాండూర్ తహసీల్దార్ రోహిత్‌దేశ్‌పాండే కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్లారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

నస్పూర్, ఫిబ్రవరి 14: నస్పూర్ మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్‌ను అధికారులు బదిలీ చేశారు. ఆయన స్థానంలో రంగారెడ్డి జిల్లా అమంగల్ మున్సిపాలిటీలో మేనేజర్‌గా పని చేస్తున్న సీహెచ్ సతీష్‌ను నియమించారు. గురువారం ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 14: శాంతిభద్రతల పరిరక్షణకు కృషి ఎస్సై మేకల సంతోష్ అన్నారు. శ్రీరాంపూర్ ఎస్సై మేకల సంతోష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన కె రాజేశ్ వెకెన్సీ రిజర్వ్‌లో ఉండగా, సీసీసీ 2వ ఎస్సైగా పనిచేసిన మేకల సంతోష్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

హాజీపూర్: హాజీపూర్ ఎస్సైగా గోపతి సురేష్ బుధవారం పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. సురేష్ కోటపల్లి పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై హాజీపూర్‌కు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై నరేష్‌కుమార్ బదిలీపై రామగుండంకు వెళ్లారు.

టేకు చెట్లు నరికిన ఒకరికి రిమాండ్

జన్నారం, ఫిబ్రవరి 14: తాళ్లపేట్ రేంజ్ పరిధిలోని మల్యాల గ్రామానికి చెందిన ముడితె నర్సయ్య అనే వ్యక్తికి టేకు చెట్లు నరికిన కేసులో బుధవారం రిమాండ్ విధించారు. ఇటీవల అటవీ ప్రాంతంలో టేకు చెట్లను అక్రమంగా నరికివేడయంతో అటవీ శాఖ అధికారులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. జడ్జి 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎఫ్ఎస్‌వో గోపికృష్ణ తెలిపారు. అనుమతి లేకుండా చెట్లు కొట్టకూడదని తెలిపారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



విశ్వనాథ ఆలయంలో పిల్లల చేత అక్షరాభ్యాసం చేయిస్తున్న తల్లిదండ్రులు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 14: జిల్లా వ్యాప్తంగా బుధవారం వసంత పంచమి వేడుకలు నిర్వహించారు. మంచిర్యాలలోని విశ్వనాథ దేవాలయంలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్ర మాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పిల్లలతో తరలి వచ్చి పిల్లల చేత అక్షరా భ్యాసం చేయించారు. వామనభట్ల బాలకృష్ణశర్మ, సంగనభట్ల నరహరిశర్మల ఆధ్వర్యంలో అక్షరా భ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి వచ్చిన పిల్లలకు, తల్లిదండ్రులకు, భక్తులకు వాసవీ కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ చేశారు.

ఏసీసీ: జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ ఇంటర్నేషనల్ పాఠశాలలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు సరస్వతి హోమం నిర్వహించారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల ఛైర్మన్ నరేందర్‌రెడ్డి మాట్లాడు తూ సరస్వతి మాతను ఆరాధించిన విద్యార్థులకు జ్ఞానం పెరిగి చదువులో ముందుంటారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ కోదండ రామాలయం ప్రాంగ ణంలో ఉన్న సరస్వతి దేవాలయంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు అంబాప్రసాద్ నేతృత్వంలో సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు, సహస్రనా మార్చన, పంచామృతాభిషేకాలను వేదమంత్రోచ్ఛరణ మధ్య నిర్వహిం చారు. వసంతం పంచమిని పురస్కరించుకొని ఆలయంలో చిన్నారులకు అక్షరా భ్యాసాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ కటుకూరి వెంకటేష్-వనస్వి దంపతులు, ఆలయ ప్రచార కార్యదర్శి దండు సదానందం, కమిటీ సభ్యుడు వెంకన్న పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులు పిల్లలతో పెద్ద సంఖ్యలో పాల్గొని అక్షరాలు దిద్దించారు.

మందమర్రిటౌన్: పట్టణంలో వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంగ న్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. సరస్వతి దేవి చిత్రపటానికి పూలమాలలు వేశారు. మాంటిస్సోరి, మదర్ థెరిస్సా పాఠశాలల్లో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

కోటపల్లి: సరస్వతి దేవి పుట్టినరోజును పురస్కరించుకుని వసంత పంచమి వేడుకలను బుధవారం కోటపల్లిలోని ఉషోదయగ్రామర్ పాఠశాలలో వైభవంగా నిర్వహించారు. ముందుగా వేద పండితులు సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు 40 మంది చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు సరస్వతి దేవి వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఉమాదేవితోపాటు చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాండూర్: తాండూర్‌లోని విద్యాభారతి పాఠశాలలో వసంత పంచమి వేడుకలను నిర్వహించారు. సరస్వతి మాతకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ శరత్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాల విడుదల చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

నస్పూర్, ఫిబ్రవరి 14: షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ (ఎస్‌సిడీడీ) పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో విధులు నిర్వర్తిస్తున్న అవుట్ సోర్సింగ్ కారికులకు నాలుగు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్య క్షుడు డి బ్రహ్మానందం డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధ వారం ఆయన కార్మికులతో కలిసి కలెక్టరేట్ కార్య నిర్వహణ అధికారికి వినతి పత్రం అందజేశారు. నాలుగు నెలలుగా విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. అతి తక్కువ వేతనంతో పనిచేసే కార్మికులకు నెల నెలా జీతాలు రాకుంటే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయని ఆయన ప్రశ్నించారు. వెంటనే వేతనాలు ఇవ్వకపోతే ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సంపత్, రాజేశ్వరి, లక్ష్మీ, అనిత, సునీత, తోకల లక్ష్మి, లావణ్య, సత్య, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారిగా రాజవీరు

ఏసీసీ, ఫిబ్రవరి 14: మంచిర్యాల జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారిగా కె. రాజవీరును నియమిస్తూ రాష్ట్ర యువజన, క్రీడల శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఇక్కడ డీవైఎస్‌వోగా పనిచేస్తున్న శ్రీకాంత్‌రెడ్డిని కరీంనగర్‌కు బదిలీ చేశారు. కరీంనగర్‌లో బాధ్యతలు నిర్వహిస్తున్న రాజవీరును మంచిర్యాలకు పోస్టింగ్ ఇచ్చారు.

రేషన్ బియ్యం పట్టివేత

చెన్నూరు, ఫిబ్రవరి 14: మండలంలోని చింతలపల్లి గ్రామ శివారులో అక్రమంగా మహారాష్ట్రకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ , టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తున్నారనే సమాచారం మేరకు అధికారులు దాడి చేసి వాహనాలను సీజ్ చేసినట్లు తెలిపారు. సుమారు 66 క్వింటాల్ల రేషన్ బియ్యాన్ని స్వాధీన పర్చుకుని చెన్నూరులోని వ్యవసాయ మార్కెట్‌కు తరలించారు. బియ్యం తరలిస్తున్న రెండు వాహనాలను సీజ్ చేసి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్‌మాట్లాడుతూ రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వన దేవతలకు ఎత్తు బంగారం

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 14: కోల్‌బెల్ట్‌లో వనదేవతలు సమ్మక్క, సారలమ్మలకు బుధవారం పెద్ద ఎత్తున ఎత్తు బంగారం సమర్పించారు. మొక్కులో భాగంగా బెల్లం తులాభారం చేయించుకోవడానికి మందమర్రి మార్కెట్‌లోని దుకాణాల వద్ద భక్తులు బారులు తీరారు.

యవత వ్యసనాలకు దూరంగా ఉండాలి

కోటపల్లి, ఫిబ్రవరి 14: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏవో మహేందర్ సూచించారు. బుధవారం కొల్లూరు, రాంపూర్ గ్రామాల్లో పంచాయతీ ప్రత్యేకాధికారిగా ఆయన యువకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అవ గాహన కల్పించారు. యువత వ్యసనాల బారిన పడకుం డా చదువుపై దృష్టి సారించాలని తెలిపారు.

సమ్మెను విజయవంతం చేయాలి


- ఐఎఫ్‌టీయూ నాయకుడు జాడి దేవరాజ్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 14: కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న చేపట్టిన దేశ వ్యాప్త కార్మికుల సమ్మె బంద్‌ను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకుడు జాడి దేవరాజ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సమ్మెలో కార్మికులు, రైతులు, విద్యార్థులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. కార్మికులకు ఇబ్బందులు కలిగించొద్దని తెలిపారు. సమావేశంలో నాయ కులు దేవయ్య, భీమయ్య, లక్ష్మణ్, పోచన్న పాల్గొన్నారు. అలాగే సమ్మెకు వామపక్ష విద్యార్థి సంఘాలు మద్దతు తెలుపుతున్నట్లు నాయకులు శ్రీకాంత్, సన్నిగౌడ్, అనిల్, రాజ్‌కుమార్, రాకేష్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమా వేశంలో తెలిపారు.

నేరాల నియంత్రణకు పకడ్బందీ చర్యలు

- ర్యాగింగ్ ఘటన కలిచి వేసింది

- రామగుండం నూతన సీపీ శ్రీనివాసులు



సీపీ శ్రీనివాసులు

కోల్‌సిటీ/ఏసీసీ, ఫిబ్రవరి 14: రామగుండం పోలీస్ కమిషరేట్‌లో నేరాల నియంత్ర ణకు పకడ్బందీ చర్యలు చేపట్టనున్నట్లు రామగుండం నూతన సీపీ వీ శ్రీనివాసులు చెప్పారు. బుధవారం శ్రీనివాసులు పోలీసులచే గౌరవ వందనం స్వీకరించి అనంతరం సీపీగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో నేరాల నియంత్రణపై చర్యలు చేపడుతామని, రామగుండం మెడికల్ కళాశాలలో ర్యాగింగ్ ఘటన తనను కలిచివేసిందని, ర్యాగింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తప్పన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను సోదరులుగా భావించి ప్రోత్సహించాలే తప్ప భయ పెట్టరాదని, కొత్తగా మెడికల్ కళాశాలకు వచ్చే వారు గ్రామాల నుంచి వస్తూ ఉంటారని, వారిని భయ భ్రాంతులకు గురి చేయవద్దన్నారు. పైశాచిక ఆనందం కోసం ర్యాగింగ్‌కు పాల్పడవద్దని, ర్యాగింగ్ నిర్మూలన కోసం కమిషనరేట్ పరిధిలోని ప్రతి కాలేజీలో అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు, ప్రత్యేక వింగ్‌ను ఏర్పాటు చేసి కాలేజీల్లో కమిటీలు వేసి ర్యాగింగ్ నిరోధకానికి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. గంజాయి నిర్మూలన కోసం మూలాలను పట్టి గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేస్తామని చెప్పారు. ఎవరైనా గంజాయి అమ్మినా, కొన్నా కఠిన చర్యలు తీసుకుంటామని, భూ మాఫియాపై ఉక్కుపాదం మోపనున్నట్లు, ఎవరైనా భూ కబ్జాలకు పాల్పడే ఉపేక్షించేది లేదన్నారు.

● అధికారులతో సమీక్ష..

రామగుండం సీపీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎం శ్రీనివాసులు బుధవారం పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఏ తరహా నేరాలు ఎక్కువగా నమోదు అవుతున్నాయి, పోలీస్ కమిషనరేట్‌లో భౌగోళిక పరిస్థితులు, మావోయిస్టు కదలికలపై ఆయన ఆరా తీశారు. ఈ సమీక్ష సమావేశంలో మంచిర్యాల డీసీపీ సుధీర్ కేకన్, గోదావరిఖని ఏసీపీ తులా శ్రీని వాసరావు, మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, వన్‌టౌన్ సీఐ ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.